# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

ఆదివారం | 29 జూన్ 2025 | పేజీలు 8





- కుత్బుల్లాపూర్ టియుడబ్ల్యుజే(హెచ్143) అధ్యక్షుడు సుధీర్ మంకాల..
- వార్తలను ఖండించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందికానీ ప్రజాస్వామ్య పద్దతిలో ఉండాలి..
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై మహాటీవిలో వార్తా కథనంపై బీఆర్ఎస్ పాశవిక దాడి..
- దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్..

# మీడియా స్వేచ్ఛను..! హరిస్తున్న బీఆర్ఎస్..?

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జూన్ 28:** తెలంగాణలో కీలకంగా చర్చనీయాంశంగా మారిన, బీఆర్ఎస్ నేతల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్రంలో తీవ్ర దుమారం లేపుతుండగా..! బీఆర్ఎస్ వర్గీయుల దాడులు, అత్యంత పాశవికంగా తయారయ్యాయని, కుత్బుల్లాపూర్ టియుడబ్ల్యుజే(హెచ్143) అధ్యక్షుడు సుధీర్ మంకాల ఓ ప్రకటనలో పేర్కొన్నారు.. ఆయన మీడియాపై దాడిని హేయమైనా చర్యగా ఆరోపించారు.. కుత్బుల్లాపూర్ టియుడబ్ల్యుజే హెచ్ 143 అధ్యక్షుడు శనివారం మహా న్యూస్ కార్యాలయంపైన బిఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.. ఈ దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఈ సందర్భంగా సుధీర్ మంకాల డిమాండ్ చేశారు.. వార్తల విషయంలో ఎలాంటి పొరపాట్లు ఉన్నా..! ఖండించే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని దానిని ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తపరచాలి గాని..! దాడులకు దిగివద్దని, ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికి లేదని ఇలాంటి దాడులకు మీడియా భయపడదని అన్నారు.

## హుజూర్‌నగర్ఎమ్మార్వో ఆఫీసులో ఏసీబీ సోదాలు.
## .రెడ్హ్యాండెడ్‌గా చిక్కిన భూభారతి ఆపరేటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** సూర్యాపేట జిల్లాలో లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు భూభారతి ఆపరేటర్. శనివారం (జూన్28) జిల్లాల్లోని హుజూర్ నగర్ ఎమ్మార్వో కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. భూమిమ్యుటేషన్ విషయంలో డబ్బులు చేసిన భూభారతి ఆపరేటర్ విజేతరెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. భూమి మ్యుటేషన్ కు ఓ రైతునుంచి 20వేలు లంచం డిమాండ్ చేయగా రూ. 12వేలు ఇచ్చేందుకు అంగీకారం చేసుకున్నారు. ఈ క్రమంలో ఏసీబీ ఆశ్రయించాడు బాధిత రైతు. బాధితుడినుంచి రూ. 12వేలు లంచం తీసుకుంటుండగా భూభారతి ఆపరేటర్ విజేత రెడ్డిని ఏసీబీ అధికారులు రెడ్? హ్యాండెడ్ గా పట్టుకున్నారు. -2 లో

## తెలంగాణలో భారీగా డీఎస్పీల బదిలీలు..
# 44 మందికి స్థానచలనం

- ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ జితేందర్
- వివిధ విభాగాలకు అధికారుల స్థానచలనం
- సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలోనూ మార్పులు




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో భారీగా బదిలీలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 44 మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) స్థాయి అధికారులను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ శనివారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ బదిలీలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా పలువురు అధికారులకు కీలక పోస్టింగులు కేటాయించారు. బదిలీ అయిన వారిలో వై. నాగేశ్వరరావును సైబరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఏసీపీగా నియమించారు. అదేవిధంగా, ఆకుల చంద్రశేఖర్‌కు మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీగా, సంపత్‌కుమార్‌కు రాచకొండ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏసీపీగా బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కమిషనరేట్ల పరిధిలో పనిచేస్తున్న డీఎస్పీలకు స్థానచలనం కల్పిస్తూ ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

# కంచ గచ్చిబౌలిలో ఐటీ టవర్లు నిర్మిస్తాం

- అభివృద్ధిని విపక్షాలు అడ్డుకుంటున్నాయి
- కాంగ్రెస్ వల్లే హైదరాబాద్‌కు ప్రపంచ ఖ్యాతి
- పీజేఆర్ ప్లై ఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతిపక్షాలు అవాస్తవాలను ప్రచారం చేస్తూ హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నాయంటూ సీఎం రేవంత్‌రెడ్డి భారాస, భాజపాలపై విమర్శలు గుప్పించారు. గతంలో కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడితే, తమ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి కాపాడిందన్నారు. విదేశాల్లో తిరిగి, పెట్టుబడుల కోసం కంపెనీలను ఒప్పించి, కంచ గచ్చిబౌలిలో ఐటీ టవర్ల నిర్మాణం మొదలుపెడితే.. ఆ పనులనూ ప్రతిపక్షాలు అడ్డుకున్నాయన్నారు. వీటన్నింటినీ ఎదుర్కొని ఐటీ టవర్ల నిర్మాణంతో 2 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. గచ్చిబౌలి కూడలిలో దివంగత పి.జనార్దన్‌రెడ్డి ఫ్లైఓవర్‌ను శనివారం సీఎం ప్రారంభించారు. అనంతరం.. అక్కడ ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. "హైటెక్‌సిటీకి అప్పటి సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి శంకుస్థాపన చేసినప్పుడు పీజేఆర్ మంత్రిగా ఉన్నారు. రాజీవ్‌గాంధీ టెక్‌పార్కును మహారాష్ట్రకు తరలించేందుకు కొందరు చేసిన ప్రయత్నాలను పీజేఆర్ అడ్డుకున్నారు. పేదల అభ్యున్నతి కోసం శ్రమించిన ఆయనను ఎప్పటికీ గుర్తు పెట్టుకోవాలన్న ఉద్దేశంతో ఈ వంతెనకు పీజేఆర్ పేరు పెట్టాం. హైటెక్‌సిటీకి కాంగ్రెస్ పునాది వేస్తే.. తర్వాతి ముఖ్యమంత్రి -2 లో

# కంచ గచ్చిబౌలిలో ఐటీ టవర్లు నిర్మిస్తాం

- మొదటి పేజి తరువాయి

చంద్రబాబునాయుడు సైబరాబాద్ పేరుతో నగరాన్ని అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లారు.

**నాగార్జున కూడా అభినందించారు..**

చెరువులు, నాలాలను సంరక్షించేందుకు హైడ్రాను ఏర్పాటు చేశాం. తమ్మిడికుంటలోని సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్-కన్వెన్షన్ కూల్చివేతతో ఆక్రమణల తొలగింపు మొదలైంది. ఇటీవల నాగార్జున నన్ను కలిశారు. ఆయన భూమిని చెరువు సంరక్షణ కోసం ఇచ్చారు. హైడ్రా చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. అంబర్‌పేటలోని ఐదెకరాల బతుకమ్మకుంటను భారాస నేతల ఆక్రమణ నుంచి విడిపించి, చెరువును పునరుద్ధరించాం. మరిన్ని చెరువులకు కూడా జీవం పోశాం.

**అమిత్‌షాను కలుస్తాం**

అభివృద్ధి పనుల కోసం ఇప్పటికి 35 సార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలను కలిశాను. ప్రాంతీయ వలయ రహదారి (ఆర్ఆర్ఆర్), మెట్రో రైలుకు, మూసీ నది అభివృద్ధికి నిధులివ్వాలని కోరినా.. కేంద్రం స్పందించట్లేదు. రాష్ట్రానికి వస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఆదివారం



కలుసుకుంటాం. ఆయన దృష్టికి ఇవన్నీ తీసుకెళ్తాం.. నిధులు సాధించే వరకు వదిలిపెట్టం.

**100 రోజుల్లో ప్రణాళిక**

ఢిల్లీ నగరం కాలుష్యం కారణంగా నివాసయోగ్యత కోల్పోతోంది. ట్రాఫిక్ సమస్యతో బెంగళూరు, ముంబయి నగరాలూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. హైదరాబాద్‌లో ఆ పరిస్థితి రావొద్దు. కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. రోడ్ల విస్తరణ, పై వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణమే లక్ష్యంగా హెచ్-సిటీ ప్రాజెక్టు రూపొందించాం. కాలుష్యానికి కారణమవుతున్న మూడు వేల ఆర్టీసీ బస్సులను జిల్లాలకు ఇవ్వాలని, నగరంలో 100 శాతం విద్యుత్తు బస్సులు నడపాలని ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదేశించాం. ఆటో కార్మికులు సీఎన్‌జీ, బ్యాటరీ ఆటోలను కొనుక్కోవాలి. క్యాబ్‌లు నడిపే సంస్థలు, వ్యక్తులు కూడా విద్యుత్తు కార్లు వినియోగించడంపై దృష్టి పెట్టాలి.

100 రోజుల్లో నగరానికి బృహత్తర అభివృద్ధి ప్రణాళిక అందుబాటులోకి వస్తుంది. విమానాశ్రయం అవతల ఉన్న 30 వేల ఎకరాల్లో భారత భావి నగరాన్ని అభివృద్ధి చేస్తున్నాం. అక్కడే క్రీడల విశ్వవిద్యాలయం, ఏఐ ఆధారిత పరిశ్రమలు, ఐటీ కంపెనీలతో.. కాలుష్యరహిత నగరం రూపుదిద్దుకుంటుంది” అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, మేయర్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.


## హుజూర్‌నగర్‌ఎమ్మార్వో ఆఫీసులో ఏసీబీ సోదాలు. .రెడ్హ్యాండెడ్‌గా చిక్కిన భూభారతి ఆపరేటర్

- మొదటి పేజి తరువాయి

హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెంకు చెందిన రైతు తోట రాంబాబు ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని తన పేరు మీద మ్యుటేషన్ కి చేసేందుకు డబ్బులు డిమాండ్ చేశారు. ప్రొసీడింగ్ పత్రాలను అందించే విషయంలో రైతు నుంచి 20వేల రూపాయలు లంచం డిమాండ్ చేసినట్లు హుజూర్ నగర్? ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఈ కేసు సంబంధించి ఎవరిదైనా పాత్ర ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు ఏసీబీ డీఎస్పీ.

## మెదక్ జిల్లా కోర్టు భవనం పైనుంచి దూకిన కుటుంబం... ఒకరి మృతి

- కోర్టు భవనం పైకి వెళ్లిన దంపతులు, ఇద్దరు కుమార్తెలు
- భవనం పైనుంచి దూకిన కుటుంబ సభ్యులు
- భార్య మృతి, మిగతా వారికి తీవ్రగాయాలు
- చికిత్స కోసం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లాలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. మెదక్ జిల్లా కోర్టు భవనం పైనుంచి దూకి ఒక కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శనివారం జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల ప్రకారం, దంపతులు తమ ఇద్దరు కుమార్తెలతో కలిసి కోర్టు భవనం పైకి చేరుకొని, అక్కడి నుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నం చేశారు.

ఈ దుర్ఘటనలో భార్య మృతి చెందగా, భర్త మరియు ఇద్దరు కుమార్తెలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితులను దౌలతాబాద్ గ్రామ వాసులుగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న దర్యాప్తు ప్రారంభించారు.

# స్కూళ్లలో జుంబా డ్యాన్స్?.. వ్యతిరేకిస్తున్న ముస్లిం సంఘాలు !





**హైదరాబాద్ పెన్ పవర్:**స్టూడెంట్స్ కేవలం క్లాసులు, చదువు, పరీక్షలు, హోం వర్క్ అనే దానికే పరిమితం కాకుండా.. ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండేందుకు కేరళ ప్రభుత్వం స్కూళ్లలో జుంబా డ్యాన్ ప్రవేశపెట్టింది. విద్యార్థుల ఫిజికల్, మెంటల్ ఫిట్ నెస్ కోసం ప్రతి రోజు జుంబా డ్యాన్స్ చేయించాలని నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు కూడా చాలా ఉత్సాహంగా డ్యాన్స్ లో పాల్గొంటున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై ఒకవైపు ప్రశంసలు వస్తుంటే.. మరోవైపు విమర్శలు ఎదురవుతున్నాయి. కేరళలో స్కూల్స్ లో జుంబా డ్యాన్స్ ఇంట్రడ్యూస్ చేయడం వివాదాస్పందా మారింది. యాంటీ-డ్రగ్ క్యాంపెయిన్ లో భాగంగా ఈ డ్యాన్స్ ను ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వం చెబుతుంటే.. ముస్లిం సంఘాలు మాత్రం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. గర్ల్స్, బాయ్స్ ఒకే చోట కలిసి డ్యాన్స్ చేయడం.. అందులో పొట్టి డ్రెస్ లతో జుంబా డ్యాన్స్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఏడాది నుంచి జుంబా డాన్స్ ట్రెయినింగ్ ను స్టార్ట్ చేస్తున్నట్లు చాలా స్కూల్స్ అనౌన్స్ చేశాయి. దీనిపై ముస్లి సంఘాలా ఆందోళ వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై విజ్డమ్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రెటరీ మాట్లాడుతూ.. దీన్ని తాము అంగీకరించమని.. ఈ సెషన్స్ లో తమ కుమారుడు పార్టిసిపేట్ చేయడని ఫేస్ బుక్ పోస్టులో ప్రకటించారు. ముస్లిం ఆర్గనైజేషన్ సమస్త సంఘానికి చెందిన మరో లీడర్.. నాసర్ ఫైజీ కూడ్తాయ్ మాట్లాడుతూ.. వ్యక్తిగత స్వేచ్ఛ హననం, వల్గారిటీ పెంచినట్లవుతుందని విమర్శించారు. జుంబా అమ్మాయిలు అబ్బాయిలు ఇద్దరూ కలిసి చేసే డాన్స్. చిన్న చిన్న డ్రెస్ లు వేసుకుని చేసే డాన్స్. ఇది చాలా అభ్యంతరకరం అని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఫిజికల్ ప్రోగ్రామ్స్ ను కాదని.. వల్గారిటీని ఇంప్లిమెంట్ చేయడం ఎంతవరకు సమంజసం అని ముస్లిం సంఘాలు ప్రశ్నిస్తున్నారు.


**యాంటీ డ్రగ్ క్యాంపెయిన్ లో భాగంగానే..**

స్కూళ్లలో జుంబా డ్యాన్స్ యాంటీ-డ్రగ్ క్యాంపెయిన్ లో భాగమేనని కేరళ విద్యా శాఖ మంత్రి వి.శివంకుట్టీ అన్నారు. ముస్లిం విద్యార్థులు కూడా ఉత్సాహంగా డాన్స్ చేస్తున్న వీడియోను పోస్ట్ చేశారు. "పిల్లలు సరదాగా ఆడాలి, పాడాలి, లాఫ్, ఫన్, హ్యాపీనెస్ తో పాటు పెరగాలి" అని అన్నారు. స్టూడెంట్స్ డ్రెస్ పై వస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. ఇలాంటి ఆలోచనలు పిల్లల మనసుల్లో డ్రగ్స్ ను మించిన విషాన్ని నింపుతాయని అన్నారు. 'పిల్లలు పొట్టి దుస్తులు వేసుకొమ్మని ఎవరూ అడగటం లేదు.. వాళ్లు స్కూల్ యూనిఫామ్స్ వేసుకుంటున్నారని చెప్పారు.

విద్యా హక్కు చట్టం ప్రకారం.. పిల్లలు లెర్నింగ్ ప్రాసెస్ లో పార్టిసిపేట్ చేయాలని.. ఇందులో పేరెంట్స్ జోక్యం చేసుకునే అవకాశం లేదని తెలిపారు. "ఇది యాంటీ డ్రగ్ క్యాంపెయిన్.. అవేర్ నెస్ ప్రోగ్రామ్ లో భాగంగా కండక్ట్ చేస్తున్నాం. అలాంటి ఆలోచనలు పిల్లల్లో విభజన సంస్కృతిని డెవలప్ చేస్తాయి" అని బదులిచ్చారు.ఇంతకు ముందు జుంబా డాన్స్ పిల్లలు ఇష్టపూర్వకంగా, వాలంటరీగా చేరేదని, అందరూ చేయాలనే మ్యాండేటరీ రూల్స్ లేవని ప్రభుత్వం ప్రకటించింది. పిల్లల్లో స్ట్రెస్ తగ్గించి, ఫిజికల్, మెంటల్ ఫిట్ నెస్ తో పాటు కాన్ఫిడెన్స్ పెంపొందిచేందుకు అందరూ పార్టిసిపేట్ చేయిస్తున్నట్లు తెలిపింది. టీచర్లు కూడా జుంబా డాన్స్ కోసం స్పెషల్ ట్రెయినింగ్ తీసుకుంటారు. విద్యార్థులు, టీచర్లు కలిసి జుంబా డాన్స్ చేస్తుండటం ఆసక్తికరంగా మారింది. దీనిపై కొందరు విమర్శిస్తుంటే.. మరి కొందరు చాలా మంచి నిర్ణయమని ఆహ్వానిస్తున్నారు.

# గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వెళ్లే వారికి గుడ్ న్యూస్.. పీజేఆర్ ఫ్లై ఓవర్ ప్రారంభం





**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లో మరో ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చింది. శిల్పా లే ఔట్ ఫేజ్ 2 ఫ్లైఓవర్ ను జూన్ 28 న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కొండాపూర్ నుంచి గచ్చిబౌలి వరకు నిర్మించిన బై డైరెక్షనల్ ఫ్లై ఓవర్ కు దివంగత కాంగ్రెస్ నేత పి. జనార్దన్ రెడ్డి(పేజేఆర్) పేరు పెట్టింది ప్రభుత్వం. ఓఆర్ఆర్ నుంచి గచ్చిబౌలి వరకు 1.2 కిలోమీటర్ల మేర నిర్మించిన ఈ బై డైరెక్షనల్ ఫ్లై ఓవర్?కు రూ. 182కోట్లు ఖర్చు పెట్టారు.

ఈ ఫ్లై ఓవర్ పై నుంచి 1.2 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 2 నిమిషాల 25 సెకన్లలో చేరుకోవచ్చు. కొత్తగూడ సమీపంలో ముగిసే ఈ ఫ్లై ఓవర్?నుంచి కొండాపూర్?వరకు ట్రాఫిక్?తిప్పలు లేకుండా చేరుకోవచ్చు. గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వెళ్లేవారికి ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. మొత్తం 4.4 కిలోమీటర్లు ఉంటే ఈ రూట్?లో ఓఆర్ఆర్?ఎగ్జిట్?నుంచి కొత్తగూడ జంక్షన్?వరకు ఉదయం, సాయంత్రం కిలోమీటర్ ప్రయాణించాలంటే దాదాపు అరగంటకు పైగానే పడుతుంది. మధ్యాహ్నం వేళలో 15 నిమిషాలకు తక్కువ పట్టడం లేదు. దీనివల్ల ఇంధన భారంతోపాటు వాహనదారులు ట్రాఫిక్ లో ఇరుక్కుపోయి చుక్కలు చూస్తున్నారు. అయితే, ఫ్లై ఓవర్ ప్రారంభంతో ఈ కష్టాలకు చెక్?పడనున్నది.

**అతిపెద్ద ఫ్లై ఓవర్లలో స్థానం..**

పీజేఆర్ ఫ్లైఓవర్ నగరంలోని అతిపెద్ద ఫ్లైఓవర్లలో ఒకటిగా స్థానాన్ని దక్కించుకోనుంది. సిటీలో పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే నాలుగు లేన్లతో11.66 కి.మీ తో మొదటి స్థానంలో నిలవగా, ఆరాంఘర్ ఫ్లైఓవర్ ఆరులేన్లతో 4.08 కి.మీ తో రెండో స్థానంలో ఉంది. కొత్తగూడ ఫ్లైఓవర్ నాలుగులేన్లతో 3 కి.మీ(మూడో స్థానం) , షేక్ పేట ఫ్లైఓవర్ ఆరులేన్లతో 2.71 కి.మీ(నాలుగో స్థానం) , శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్ ఫేజ్ - 1 నాలుగు లేన్లతో 1.75 కి.మీ (ఐదోస్థానం) ఉండగా, ఓవైసీ- మిథాని ఫ్లైఓవర్ మూడు లేన్లతో 1.40 కి.మీ (ఆరో స్థానం) ఉంది. ఆ తర్వాత పీజేఆర్ ఫ్లైఓవర్ 1.20 ఏడో స్థానంలో నిలిచింది. దీని తర్వాత బాలానగర్ ఫ్లై ఓవర్ 1.13 కి.మీతో ఎనిమిదో స్థానాన్ని దక్కించుకుంది.

## 'అంబానీల్లా.. దిండిలో పెళ్లి చేసుకునేలా'..

# ఏపీకి రాందేవ్ బాబా హామీ!



**హైదరాబాద్ పెన్ పవర్:**శుక్రవారం విజయవాడలో జరిగిన టూరిజం కాన్ క్లేవ్ లో ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గురించి ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి పలు ఆసక్తికర హామీలు ఇచ్చారు. ఇందులో ప్రధానంగా 'దిండిలో వెడ్డింగ్ డెస్టినేషన్ క్రూజ్' అనే విషయం హాట్ టాపిక్ గా మారింది. అవును... విజయవాడలో జరిగిన టూరిజం కాన్ క్లేవ్ లో పాల్గొన్న రాందేవ్ బాబా... ఏపీ పర్యాటకానికి బ్రాండ్ అంబాసిడర్ గా ఉండేందుకు సిద్ధం అని ప్రకటించారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాలను తాను కించపరచడం లేదు.. కానీ, ఏపీలో ఉన్న సుందరమైన అటవీప్రాంతం, సముద్రతీరం, వైవిధ్యమైన వాతావరణం దేనికదే ప్రత్యేకం అని అన్నారు. ఈ సందర్భంగా... ఏపీలో ఏమైనా చేద్దామని తాను ఆలోచిస్తుండగా.. చంద్రబాబు తనతో మాట్లాడారని.. రాష్ట్రంలో వెల్ నెస్ సేవలను అందుబాటులోకి తేవాలని సూచించారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే.. రూ.500 కోట్లకు పైగా పెట్టుబడితో వెల్ నెస్ సేవలను తీసుకొస్తానని.. హార్సిలీ హిల్స్ ను ఐకానిక్ వెల్ నెస్ కేంద్రంగా ప్రపంచపటంలోకి తీసుకొస్తానని తెలిపారు.

ఈ నేపథ్యంలోనే దిండిలో వెడ్డింగ్ డెస్టినేషన్ క్రూజ్ విషయాన్ని వెల్లడించారు యోగా గురు రాందేవ్ బాబా. ఇందులో భాగంగా... అంబానీల్లాగా పెళ్లి చేసుకోవాలనే కోరిక చాలామందికి ఉండవచ్చని.. అలాంటి వారందరికీ నచ్చేలా దిండిలో వెడ్డింగ్ డెస్టినేషన్ క్రూజ్ ను ఏర్పాటు చేస్తామని.. దిండి ఒక పెద్ద వెడ్డింగ్ డెస్టినేషన్ అవుతుందని అన్నారు. అక్కడ.. వేదపండితులు, పూజసామగ్రి, మ్యూజిక్ వంటివన్నీ సమకూరుస్తామని.. ఫలితంగా రాబోయే రోజుల్లో ప్రపంచం మొత్తం మీద వెడ్డింగ్ డెస్టినేషన్ గా ఆంధ్రప్రదేశ్ అవుతుందని.. దానికి అవసరమైన మార్కెటింగ్ ను తానే ఉచితంగా చేస్తానని రాందే బాబా హామీ ఇచ్చారు.

కాగా... ఆంధ్రప్రదేశ్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గోదావరి ఒడ్డున ఉన్న గ్రామం దిండి. ఇక్కడ ఇప్పటికే రిసార్ట్స్ అందుబాటులో ఉన్నాయి. ఇదే సమయంలో.. గోదావరిలో బోటు షికారు సౌకర్యమూ ఉంది. ఈ నేపథ్యంలో... అక్కడ వెడ్డింగ్ డెస్టినేషన్ క్రూజ్ ను ఏర్పాటు చేస్తామని రాందేవ్ బాబా హామీ ఇవ్వడంతో టూరిజంగా ఆ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని అంటున్నారు.

# ఆరు నెలల్లో 30 వేల ఓటర్లు.. మహారాష్ట్ర సీఎం రిగ్గింగ్ చేసి గెలిచారా..? సంచలనం సృష్టిస్తున్న రిపోర్ట్ !

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత ఎన్నికల సరళి, పోలింగ్ విధానం.. టెక్నాలజీతో పాటు మారు తూ వస్తోంది. ఓటర్ స్లిప్పుల నుంచి %జుఎవీ% మెషీన్లకు మార్పు చెందడం ప్రపంచానికే ఆదర్శంగా చెప్పుకుంటున్న సందర్భం. టెక్నాలజీతో అనుసంధానం చేయటం ద్వారా అత్యంత విశ్వసనీ యంగా, అక్రమాలకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తున్నామని ఎన్నికల సంఘం చెప్పుకుంటున్న తరుణం. కానీ ఈవీఎం లు వచ్చిన తర్వాత కూడా రిగ్గింగ్ జరుగుతోందని.. దేశ వ్యాప్తంగా తాము గెలవాల్సి ఉంటే మరో పార్టీ గెలిచిందని ప్రధాన ప్రతిపక్ష పార్టీ గత కొంతకాలంగా ఆరోపిస్తూ వస్తోంది. ఈ ఆరోపణ లకు బలం చేకూర్చేలా ఒక రాష్ట్రంలో ఆరు నెలల్లోనే వేల సంఖ్యలో ఓటర్లు లిస్టులోకి చేరడం.. తప్పుడు అడ్రస్ అని తేలడం సంచలనం సృష్టిస్తోంది. ఏకంగా సీఎం గెలిచిన స్థానంలోనే ఆరు నెలల్లో 30 వేల ఫేక్ ఓటర్లు లిస్టులో చేరినట్లు ఒక రిపోర్ట్ రావడం ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని ఇరకాటంలో పెట్టాయి. వివరాల్లోకి వెళ్తే.. ఎన్నికల సంఘం మద్దతుతో బీజేపీ, ఎన్డీఏ పార్టీలు అక్రమంగా ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ తర్వాత మహారాష్ట్రలో కూడా రిగ్గింగ్ కు పాల్పడ్డారని, సీఎంతో సహా చాలా మంది నేతలు అక్రమ ఓట్లతోనే గెలిచారని ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలకు బలం చేకూర్చేలా న్యూస్ లాండ్రీ అనే వెబ్ సైట్ ఆధారాలతో సహా ఫేక్




ఓటర్ల లిస్టుతో రిపోర్టు విడుదల చేసింది. 2024 లోక్ సభ ఎన్నికలు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నాగ్ పూర్ సౌత్ వెస్ట్ స్థానంలో 29,219 కొత్త ఓటర్లు చేరినట్లు రిపోర్టు వెల్లడించింది. అంటే యావరేజ్ గా రోజుకు 162 కొత్త ఓట్లు యాడ్ అయ్యాయి. ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం 4 శాతం ఓట్లు యాడ్ కావడం సహజం. కానీ దానికి రెండింతలు అంటే 8.25 శాతం ఓటర్లు జమ కావడం అనుమానాలకు తావిస్తోంది. అయినప్పటికీ ఎలాంటి విచారణ, తనిఖీలు జరగలేదని ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని ఏరియాల్లో అత్యధికంగా ఓటర్లు చేరడం గమనించినట్లు స్థానిక పోలింగ్ ఏజెంట్లు ఆరోపిస్తున్నారు.

అయితే Newslaundry తనిఖీలలో కేవలం 50 బూత్ స్థేషన్లలోనే 4,000 ఓటర్లు చేరినట్లు.. అది కూడా వారికి ఎలాంటి అడ్రస్ కూడా లేనట్లుగా తేలింది. ఆ నియోజకవర్గంలో అవి భోగస్ ఓట్లా కాదా అనే కోణంలో ఎన్నికల సంఘం విచారణ చేయాల్సి ఉంది.

నాగ్ పూర్ సౌత్ వెస్ట్ స్థానంలో 2,301 ఓట్లను తొలగించారు. ఈ స్థానం నుంచి ఫడ్నవీస్ 39 వేల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి ప్రఫుల్ గుడాధే ను ఓడించారు. ఇక్కడ దేవేంద్ర ఫడ్నవీస్ కు ఇది వరుసగా నాలుగో విజయం. లోక్ సభ పోలింగ్ తో పోల్చితే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానంలో బీజేపీకి 14,225 ఓట్లు అదనంగా వచ్చాయి. కాంగ్రెస్ కు కేవలం 8 వేల ఓట్లు అధికంగా వచ్చాయి.

ఈ విషయంలో ఎన్నికల సంఘం ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటోంది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ తో పాటు మహారాష్ట్రలో కూడా రిగ్గింగ్ జరిగితే.. ఎన్నికల సంఘం నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తోందని రాహుల్ గాంధీ విమర్శలు చేస్తూనే ఉన్నారు.

**ఆ ఓటర్లను ట్రేస్ చేయలేం:**

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఏ నియోజక వర్గంలోనైనా 4 శాతం కొత్త ఓటర్లు జమ కావడం సహజం. అదే విధంగా 2 శాతం లోపు డిలీట్ చేయడం కూడా సహజం.. 4 శాతానికి మించి కొత్త ఓటర్లు చేరినా.. 2 శాతానికి మించి డిలీట్ అయినా.. క్రాస్ వెరిఫికేషన్ చేసి.. అవి ఫేక్ ఓట్లా కాదా అని చెక్ చేసుకోవాల్సి ఉంటుంది. దీనిపై ఎన్నికల అధికారి ఒకరు మాట్లాడుతూ.. "2 శాతం, 4 శాతం ఓటర్లు చేరడం ఓకే. కానీ అంతకు మించి ఓటర్లు చేరుతున్నారంటే డబుల్ చెక్ చేసుకోవాల్సిందే"నని అన్నారు. ఆ నియోజకవర్గంలో మొత్తం 378 బూత్ లు ఉంటే.. 70 శాతం అంటే 263 బూత్ లలో 4 శాతానికి పైగా కొత్త ఓటర్లు చేర్చినట్లు రిపోర్ట్ లో తేలింది. అందులో 26 బూత్ లలో 20% శాతానికి పైగా ఓట్లు యాడ్ అయ్యాయని, మరో 4 బూత్ లలో 40 శాతాన్ని మించి జమ అయినట్లుగా తేలింది. ఈ కొత్త ఓటర్లకు అడ్రస్ లేకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. కేవలం ఒక్క నియోజకవర్గంలోనే ఇన్ని ఫేక్ ఓట్లు వచ్చినప్పుడు.. రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి ఏంటని స్థానిక నాయకులు ప్రశ్నిస్తున్నారు. మహారాష్ట్రలో రిగ్గింగ్ చేసి గెలిచారనేందుకు ఇదే సాక్ష్యమని, ఎన్నికల సంఘం విచారణ జరపాలని పోలింగ్ బూత్ లీడర్లు డిమాండ్ చేస్తున్నారు.

# చంద్రబాబు వార్నింగులు.. జగన్ జోకులు.. వాట్ నెక్స్ట్ ..!



**హైదరాబాద్ పెన్ పవర్:**ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు గత నాలుగు రోజులుగా వైసీపీ విషయంలో తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. వార్నింగులు కూడా ఇస్తున్నారు. అయితే.. వీటిని వైసీపీ అధినేత జగన్ లైట్ తీసుకుంటున్నా రు. జోకులు పేలుస్తున్నారు. మరి ఈ రెండు పరిణామాలను గమనిస్తే.. తదుపరి ఏం జరుగుతుంది? వాట్ నెక్స్ట్? అనేది ఆసక్తిగా మారింది. ప్రధానంగా వైసీపీ.. ఇంటింటికీ కార్యక్రమాన్ని ప్రకటించిన తర్వాత.. కూటమిలో కొంత ఆలోచన ఏర్పడింది.మరీ ముఖ్యంగా టీడీపీలో చర్చ అయితే సాగుతోంది. 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో%-% పేరుతో జగన్ ఇచ్చిన పిలుపుతో.. నాయకులు ప్రజల మధ్యకువెళ్లేందుకు రెడీ అయ్యారు. దీనిని ఆయన నాయకులకు టార్గెట్‌గా కూడా పెట్టారు. గత ఎన్నికలకు ముందు సూపర్ 6తో పాటు.. 143 హామీలు గుప్పించారని.. దీనికి తోడు ప్రతి ఇంటికీ.. ఆయా కుటుంబ పెద్దల పేరుతో బాండ్లు ఇచ్చారని.. ఇప్పుడు వీటిని కూడా ప్రజలకు గుర్తు చేయాలని జగన్ చెబుతున్నారు.

ఈ క్రమంలో ఇటు సోషల్ మీడియాలోనూ.. అటు ప్రధాన మీడియా సాక్షిలోనూ.. ఐదు వారాల పాటు.. కూట మి సర్కారుపై ప్రచార యుద్ధాన్ని జగన్ ప్రారంభించారు. డిజిటల్ రూపంలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయ దం ద్వారా.. నాటి చంద్రబాబు హామీలను ప్రజల ముందు ఉంచే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది లేని వారికి నేరుగా నాయకులు సదరు బాండ్లతో కలవనున్నారు. ఇది ఇప్పటి వరకు ఉన్న రాజకీయాలను.. ప్రచార యుద్ధాన్ని కూడా.. యూటర్న్ తీసుకునేలా చేయనుంది.దీనిని గమనించారో ఏమో చంద్రబాబు సీరియస్‌గానే వార్నింగ్ ఇచ్చారు. సూపర్ 6 అన్నీ అయిపోయాయని.. ఎవరైనా కాదు లేదని అడిగితే.. తాట తీస్తామని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేరు చెప్పి మరీ ఆయన సీరియస్‌గానే కామెంట్లు చేశారు. కానీ.. వీటిని జగన్ లైట్ తీసుకుంటున్నారు. ఏం చేస్తారో.. చేయనీ.. ప్రజల తాట అయితే.. తీయలేరుకదా? అని జోక్ చేశారు. అంతేకాదు.. ప్రజల మధ్యకు వెళ్లకుండా తమను ఎవరూ ఆపలేరని కూడా చెప్పుకొచ్చారు.ఈ క్రమంలో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఏం జరుగుతుందన్నది ఆసక్తిగా మారింది. గ్రామాల స్థాయిలో ఇరు పార్టీల మధ్య రాజకీయ వివాదాలు, రగడలు, ఘర్షణలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నది పరిశీలకులు చెబుతున్న మాట. మరి ఇదే జరిగితే.. సర్కారుకు మరో ఇబ్బంది తప్పదు. దీనిని సానుకూలంగా చూస్తే ఫర్వాలేదు. కానీ.. ఇరు పక్షాలు అలా లేకపోవడంతో ఏమైనా జరగొచ్చన్నది పరిశీలకులు కూడా చెబుతున్న మాట.

## మాజీ ISIS చీఫ్సక్విబ్నాచన్మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:**నిషేధిత ఉగ్రవాద గ్రూప్ ISIS మాజీ చీఫ్, స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్ మెంట్ఆఫ్ ఇండియా (SIMI) సక్విబ్ నాచన్శనివారం (జూన్ 28) ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. నాలుగు రోజుల క్రితం మెదడులో రక్తస్రావంతో నాచన్? ఢిల్లీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ చనిపోయారు. మహారాష్ట్రలోని థానే జిల్లా పడ్ఘా నివాసి అయిన నాచన్ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నప్పుడు అకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణించడంతో జూన్ 24 న ఆయనను తీహార్ జైలు నుంచి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నాచన్? శనివారం మధ్యాహ్నం 12:10 గంటల ప్రాంతంలో అతను మృతిచెందాడు. 2023 ఐసిస్ తో సంబంధాలున్నాయని నాచన్‌ను %NIA% అరెస్ట్ చేసింది.నాచన్? ముంబై పేలుళ్ల ,ఉగ్రవాద కేసుల్లో కీలక నిందితుడు.

## 'మహా టీవీ' వివాదం... లీగల్ నోటీసులు పంపిన బీఆర్ఎస్ పార్టీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో తమ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లను లక్ష్యంగా చేసుకుని ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారానికి పాల్పడుతోందని ఆరోపిస్తూ ప్రముఖ తెలుగు న్యూస్ ఛానల్ మహా టీవీ యాజమాన్యానికి బీఆర్ఎస్ పార్టీ లీగల్ నోటీసులు జారీ చేసింది. ఛానల్ కార్యాలయంపై దాడి జరిగిన రెండు గంటల వ్యవధిలోనే ఈ నోటీసులు పంపడం చర్చనీయాంశంగా మారింది. తమ నాయకులపై జర్నలిజం ముసుగులో వ్యక్తిగతంగా విషం చిమ్ముతుండటంతో నోటీసులు ఇచ్చినట్లు బీఆర్ఎస్ పార్టీ తెలిపింది. గత కొంతకాలంగా ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి మహా టీవీ తమ యూట్యూబ్ ఛానల్‌లో తప్పుడు థంబ్‌నెయిల్స్‌తో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వార్తా కథనాలను ప్రసారం చేస్తోందని బీఆర్ఎస్ తన నోటీసులో ఆరోపించింది. పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఛానల్ తన వైఖరి మార్చుకోలేదని, జర్నలిజం ముసుగులో తమ పార్టీ నాయకత్వంపై వ్యక్తిగత దూషణలకు దిగుతోందని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా 'తమ్మినేని తమ్ముడు' వంటి పాత్రలతో కించపరిచేలా కథనాలు రూపొందించి, తమ నేతల ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వంలోని కొందరు నేతలతో కుమ్మక్కై మహా టీవీ యాజమాన్యం ఈ దుష్ప్రచారానికి పాల్పడుతోందని పార్టీ ఆరోపించింది. ఇప్పటికైనా మహా టీవీ వైఖరి మార్చుకోకపోతే, చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని బీఆర్ఎస్ హెచ్చరించింది. గతంలో మంత్రి కొండా సురేఖపై తమ పార్టీ వేసిన రూ.100 కోట్ల పరువు నష్టం దావా, క్రిమినల్ డెఫమేషన్ కేసును ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఆ కేసులో న్యాయస్థానం, ఎన్నికల సంఘం ఆమెను హెచ్చరించిన విషయాన్ని ప్రస్తావించింది. మహా టీవీ కూడా తమ విధానాలు మార్చుకోని పక్షంలో అదే తరహాలో పరువు నష్టం దావా, క్రిమినల్ చర్యలు తప్పవని స్పష్టం చేసింది. వార్తా సంస్థగా మహా టీవీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, జర్నలిజాన్ని వ్యక్తిగత ఎజెండాలకు కాకుండా ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాలని బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది.

## బెంగళూరులో కొత్త క్రికెట్ స్టేడియం.. ఈసారి 60వేల సీటింగ్ కెపాసిటీ: డికె శివకుమార్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ నెలలో జరిగిన ఐపీఎల్ ఫైనల్స్ లో ఆర్సీబీ జట్టు విజయం సాధిం చింది. అయితే ఆ తర్వాత విజయోత్సవ వేడుకల సమయంలో జరిగిన తొక్కిసలాటలో కొందరు ప్రాణాలు కోల్పోవటం పెద్ద చర్చకు దారితీసింది. చిన్న స్వామీ స్టేడియం వెలుపల ఎక్కువ సంఖ్యలో వచ్చిన అభిమానులకు అనుగుణంగా ఏర్పాట్లు జరగలేదని తర్వాత ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. పైగా బెంగళూరు నగరానికి ఇలాంటి విజయోత్సవ వేడుకలను గతంలో నిర్వహించిన అనుభవం కూడా లేకపోవటంతో ప్రమాదం చోటుచేసుకుందని కొందరు నిపుణులు చెబుతున్నారు. దీంతో అక్కడి ప్రభుత్వం చిన్న స్వామి స్టేడియం అక్కడి నుంచి తరలించాలని మరో చోట కొత్త స్టేడియం కట్టాలని నిర్ణయించింది. తాజాగా దీనిపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ మాట్లాడుకూ నగరానికి కొత్త స్టేడియం వస్తుందన్నారు. అయితే ఈ సారి నిర్మించే స్టేడియంలో 60వేల మంది కూర్చునేందుకు వీలుగా సీటింగ్ కెపాసిటీని పెంచుతున్నట్లు చెప్పారు. పెద్ద ఈవెంట్స్ సమయంలో ఇది ఎక్కువ మంది అభిమానుల తాకిడిని తట్టుకోగలుగుతుందని ఆయన అన్నారు. అలాగే కొత్త స్టేడియం నిర్మాణానికి స్థలం కూడా ఎంపికైందని శివకుమార్ అన్నారు. జూన్ 4న జరిగిన తొక్కిసలాటలో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోవటంతో పాటు చాలా మంది గాయాలపాలయ్యారు. వాస్తవానికి చిన్నస్వామి స్టేడియం నగరం మధ్యన ఉండటంతో పాటు పెద్ద సంఖ్యలో అభిమానులు అక్కడికి చేరుకోవటం పరిస్థితులు అదుపుతప్పేందుకు కారణమైందని వెల్లడైంది. ప్రస్తుతం చిన్న స్వామి స్టేడియం కేవలం 35వేల మందికి అనుగుణంగా ఉండగా.. ప్రమాదం రోజు స్టేడియం వద్దకు 3 లక్షల మంది అభిమానులు వచ్చినట్లు వెల్లడైంది.

# 'బాబూస్' రీకాలింగ్ సరే.. మనమేంటి.. జగనన్నా..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ''రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో'' పేరుతో వైసీపీ అధినేత జగన్ ఇంటింటి ప్రచారానికితెరదీశారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నారు. తద్వారా 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసి.. నిలదీయాలన్న లక్ష్యంతో జగన్ రాజకీయ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనివల్ల ప్రజలు వైసీపీవైపు మొగ్గు చూపుతారో లేదో తెలియదు కానీ.. చంద్రబాబుపై వ్యతిరేకత పెంచుకుంటారన్నది జగన్ వ్యూహం.

బాగానే ఉంది. అయితే.. వైసీపీకి రీకాలింగ్ అవసరం లేదా? అనేది ప్రశ్న. ఎందుకంటే.. ప్రజల్లో చంద్రబా బుపై వ్యతిరేకత పెంచినంత మాత్రాన అది వైసీపీకి సానుకూలంగా మారుతుందన్న సంకేతాలు ఇస్తున్నది అనేక అనుమానాలు ఉన్నాయి. ఒకవేళ జగన్ అనుకున్నట్టుగా కాకుండా.. ఈ వ్యతిరేకత అటు పవన్ కో.. లేక కాంగ్రెస్‌కో అనుకూలంగా మారితే.. అప్పుడు వైసీపీ ఏం చేయాలన్నది కూడా ప్రశ్న. కాబట్టి.. రీకాలింగ్ విషయంలో ముందు సొంత పార్టీపైనే జగన్ దృష్టి పెడితే బెటర్ అన్న సూచనలు వస్తున్నాయి.

**ఈ క్రమంలో ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావిస్తున్నారు.**

1) నాయకుల్లో ఉన్న అసంతృప్తి: వైసీపీ అధినేతపై ఏడాది కిందట ఎలాంటి అసంతృప్తి నాయకుల్లో పెరిగిందో ఇప్పుడు కూడా అంతే అసంతృప్తి ఉందనేది వాస్తవమని పరిశీలకులు చెబుతున్నారు. నియోజకవర్గాల మార్పు కావొచ్చు. అధినేత తమకు అప్పాయింట్‌మెంట్ ఇవ్వకుండా.. అవమానించడం కావొచ్చు. తాడేపల్లిలో అధికారం ఒక్కరి చేతిలోనే ఉంచడం కావొచ్చు. ముందు వీటి నుంచి జగన్ బయట పడాలి.

2) కార్యకర్తలకు ప్రాధాన్యం: ఇది అధికారంలోకి వచ్చిన తర్వాత.. వైసీపీ మరిచిపోయిన ప్రధాన అంశం. దీని నుంచి బయట పడతామని.. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని జగన్ చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో దానిపై ఇంకా సందేహాలు ఉన్నాయి. సో.. దీనిపైనా జగన్ ఆత్మ విమర్శ చేసుకుని రీకాల్ చేసుకోవాలనే సూచనలు వినిపిస్తున్నాయి.

3) రాజధాని, అభివృద్ధి: ఈ రెండు అంశాలే గత ఎన్నికల్లో వైసీపీకి పెద్ద మైనస్ అయ్యాయి. ఈ నేపథ్యంలో రాజధాని అమరావతి విషయంలోను.. రాష్ట్ర అభివృద్ధి విషయంలోనూ..జగన్ ఒక క్లారిటీ ఇచ్చి.. గతాన్ని గుర్తు చేసుకుని ప్రజల మధ్యకు వస్తే బెటర్ అని చెబుతున్నారు. ఈ రీకాలింగ్ వైసీపికి అవసరమన్నది మెజారిటీ నాయకుల వాదన.

# విమాన ప్రమాదం దర్యాప్తు అధికారికి ఎక్స్ - కేటగిరీ భద్రత.. ఏం జరిగింది



**హైదరాబాద్ పెన్ పవర్:** అహ్మదాబాద్ లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం ఒక్కసారిగా ప్రతిఒక్కరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో 275 మంది మరణించారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దర్యాప్తు చేస్తుంది. ఈ దర్యాప్తు బృందానికి ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్ నాయకత్వం వహిస్తున్నారు!

ఈ సమయలో ఏఏఐబీ డీజీ జీవీజీ యుగంధర్ విషయంలో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా... ఆయనకు ఎక్స్-కేటగిరీ రక్షణ కల్పించడం ద్వారా భద్రతను పెంచింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై జరుగుతున్న దర్యాప్తులో ఆయనకు ప్రమాదం పొంచి ఉన్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అంచనాను అనుసరించి ఈ చర్య తీసుకున్నారు.

అవును... ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) డీజీ యుగంధర్ కు ఇక నుంచి 'ఎక్స్' కేటగిరీ భద్రత కల్పిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వర్గాలు శనివారం వెల్లడించాయి. ఈ నిర్ణయం జూన్ 16 నుంచే అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నాయి. ఈ నిర్ణయం ప్రకారం.. ఆయనకు సీఆర్పీఎఫ్ కమాండోలతో రక్షణ కల్పిస్తున్నారు.

జూన్ 12న సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన ఎయిరిండియా విమానం కొన్ని క్షణాల్లోనే కుప్పకూలిపోగా.. ఈ ఘటన జరిగిన ఆ మరుసటి రోజే (జూన్ 13న) ప్రమాదంపై దర్యాప్తునకు ఏఏఐబీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి ఏఏఐబీ డీజీ జీవీజీ యుగంధర్ నేతృత్వం వహిస్తున్నారు.

ఇక ఈ బృందంలో... ఏవియేషన్ మెడిసిన్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, నేషనల్ ట్రాన్స్ పోర్టేషన్ సేఫ్టీ బోర్డు నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ప్రమాదానికి గురైన విమానం నుంచి సేకరించిన బ్లాక్ బాక్స్ లను ఏఏఐబీ ల్యాబ్ కు తరలించి.. అందులోని డేటాను విజయవంతంగా డౌన్ లోడ్ చేశారు. ప్రస్తుతం విశ్లేషణ జరుగుతోందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

కాగా... అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. సమీపంలోని మెడికల్ కాలేజ్ హాస్టల్ బిల్డింగ్ సముదాయాలపై కూలిపోయింది. ఈ ఘటనలో విమానంలోని 241 మందితో పాటు బయట ఉన్నవారు 34 మంది మృతిచెందారు.

# ఎద బరువు మోస్తుంది.. కన్నీళ్లు పెట్టిస్తున్న యాంకర్ స్వేచ్ఛ కవిత

**హైదరాబాద్ పెన్ పవర్:**వ్యక్తిగత సమస్యలతో ఆత్మహత్య చేసుకున్న న్యూస్ చానెల్ యాంకర్ స్వేచ్ఛ వొటార్కర్ రాసిన "ఎద బరువు మోస్తుంది.." అనే కవిత ఆమె అంతర్గత వేదనకు అద్దం పడుతోంది. ఆమె కవితలోని కొన్ని పంక్తులు ఇక్కడ ఉన్నాయి:

"ఎద బరువు మోస్తుంది.. అలసిపోతుంది.. అలిగిపోతుంది..పగిలిపోయిన వేళ కనుమరుగైపోతుంది.. కాలాన్ని దాచిన కాలం శవమైపోతుంది..అందుకే ఊపిరున్నంతసేపు ఉండకుండా పాకు.. ఉండకూడని చోటికి అసలే పాకు.." అంటూ సాగిన ఈ పంక్తుల్లోని ప్రతి అక్షరం ఆమె గుండెలోని లోతైన బాధను, జీవితంతో ఆమె చేసిన పోరాటాన్ని తెలియజేస్తుంది. తన హృదయ వియోగాన్ని ఏదో ఒక రూపంలో పంచుకోవాలని ఆమె ప్రయత్నించినట్లు స్పష్టమవుతోంది.



స్వేచ్ఛ రాసిన ఈ కవిత "ఉండకుండా పోకు" అనే శీర్షికతో ఇటీవల ఒక మ్యాగజైన్‌లో ప్రచురితమైంది. ఈ రచనలో ఆమె జీవితం పట్ల ఉన్న దిగులు, ఒంటరితనం, నిరాశలను అక్షర రూపంలో పొందుపరిచారు. "పుట్టడమూ చావడమూ స్పృశించలేని వ్యథలో నిదురిస్తూనే ఉంటాను.. అంతకంటే ముందే నాకు నువ్వు ఉండకుండా పోకు.." ఈ పంక్తులు ఆమె మనసులో తలెత్తిన తీవ్రమైన అవస్థలను చక్కగా వివరిస్తున్నాయి. ఒక రచయిత్రిగా ఆమెకు ఉన్న ఆంతర్యం, భావవ్యక్తీకరణ సామర్థ్యం ఈ కవిత ద్వారా పలకరించింది.

**తొలగని విషాదం, కొనసాగుతున్న దర్యాప్తు**

స్వేచ్ఛ వొటార్కర్ ఆత్మహత్య ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం నివేదిక ప్రకారం ఇది ఆత్మహత్య అని స్పష్టమైంది. ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితులు ఈ సంఘటనను జీర్ణించుకోలేకపోతున్నారు. స్వేచ్ఛ తన మొదటి భర్తతో విడిపోయిన తర్వాత పూర్ణ చంద్రరావు అనే వ్యక్తితో సహజీవనం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సహజీవనమే ఆమె బలవన్మరణానికి కారణమని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. స్వేచ్ఛకు ఒక కుమార్తె కూడా ఉంది. "అమ్మ ఎప్పుడూ స్ట్రాంగ్‌గా ఉండమంటూ చెప్పింది%ా% కానీ అమ్మ ఇలా చేసుకుందంటే నమ్మలేకపోతున్నా" అని ఆ బాలిక కన్నీళ్లు పెట్టుకుంది. ఆమె స్నేహితులు కూడా ఈ విషాద ఘటనను కలలోనైనా ఊహించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జీవితం ఓ పోరాటం ఆమె ఆఖరి మాటలు**

స్వేచ్ఛ కవితలో కనిపించిన భావావేశం కేవలం ఆమెకు మాత్రమే పరిమితమై ఉండకపోవచ్చు. చాలా మంది నిశ్శబ్దంగా జీవితంతో పోరాడుతుంటారు. కానీ తమ బాధను మాటల్లో, కలంలో, కన్నీళ్లలో వ్యక్తం చేయలేరు. ఆమె చివరిసారిగా రాసిన పంక్తులు జీవితానికి శాశ్వతంగా ఒక గుర్తుగా మిగిలిపోతాయి: "ఉండకుండా పోకు.. ఉండకూడని చోటుకు పోకు%ా%" ఈ భౌతిక లోకం నుండి ఆమె ఊపిరిని కోల్పోయినా, ఆమె భావాలు, అక్షరాలు నిరంతరం జ్ఞాపకాల రూపంలో మనల్ని పలకరిస్తూనే ఉంటాయి.

# తాజా డిమాండ్: మమ్దానీ పౌరసత్వాన్ని రద్దు చేయాలి



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాలోని ప్రముఖ మహానగరాల్లో ఒకటి న్యూయార్క్. ఈ నగర మేయర్ పదవికి పోటీ పడుతున్న భారత సంతతి నాయకుడు జోహ్రాన్ మమ్దానీ గురించి తెలిసిందే. ముస్లిం అయిన ఆయన ఇప్పటికే హాట్ టాపిక్ గా మారారు. డెమొక్రటీ పార్టీకి చెందిన ఇతను ఇప్పటికే పార్టీ ప్రైమరీలో నెగ్గారు. ఇలాంటివేళ.. అధికార రిపబ్లిక్ పార్టీ ఈయనపై సంచలన ఆరోపణలు చేయటమే కాదు షాకింగ్ డిమాండ్ ను తెర మీదకు తీసుకొచ్చింది. ఆయనకు జారీ చేసిన పౌరసత్వం మీద దర్యాప్తు చేయాలని.. ఆయన అక్రమ పద్ధతిలో సిటిజన్ షిప్ పొందినట్లుగా ఆరోపిస్తున్నారు. అసలు ఆయన అమెరికా పౌరుడు కాదని..ఆయన పౌరసత్వాన్ని రద్దు చేసి.. దేశం నుంచి గెంటేయాలని కోరుతున్నారు. ఇదేదో మాట వరసకు కాదు. పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ఆయన పౌరసత్వం రద్దుపై టెన్నిస్సీ రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు ఆండీ ఓగ్లెస్ యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీకి లేఖ రాశారు.

ఇక.. మమ్దానీ బ్యాక్ గ్రౌండ్ గురించి తెలిసిందే. ప్రముఖ దర్శకురాలు మీనా నాయర్ కొడుకే ఈ మమ్దానీ. ఆయనకు 2018లో అమెరికా పౌరసత్వం లభించగా.. 2021 నుంచి న్యూయార్క్ చట్టసభ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయనపై రిపబ్లిక్ పార్టీ నేతలు చేస్తున్న ప్రధాన ఆరోపణల్ని చూస్తే..

**ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చారు**

ఉగ్రవాదులతో తనకున్న సంబంధాల్ని దాచి పెట్టారు

రాడికల్ వ్యక్తి న్యూయార్క్ సిటీని నాశనం చేస్తాడా?

వంద శాతం కమ్యూనిస్టు పిచ్చోడు

పాలస్తీనా అనుకూల.. ఇజ్రాయెల్ వ్యతిరేకి

తరచూ అబద్దాలు చెబుతాడు. పూర్తి అవకాశ వాది.

నెరవేర్చలేని, అసాధ్యమైన హామీల్ని వాగ్దానాల్ని ఇస్తాడు

భారత ప్రధాని నరేంద్ర మోడీ మీదా తీవ్రస్థాయిలో విరుచుకుపడటం తెలిసిందే. 2002లో గుజరాత్ ఘర్షణల వేళ మమ్దానీ చేసిన వ్యాఖ్యల వీడియో పెద్ద ఎత్తున వైరల్ అయ్యింది. గుజరాత్ లోని ముస్లింలను అంతం చేసేందుకు కుట్ర జరిగిందని.. చాలా మందిని హత్య చేశారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులా మాదిరే మోడీ కూడా యుద్ధ నేరస్తుడేనంటూ మండిపడటం తెలిసిందే. దీంతో.. పలువురు హిందువులు కూడా ఆయనకు వ్యతిరేకంగా ఉన్నారు.తన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఇస్తున్న హామీల మీద పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మమ్దానీని ఓడించేందుకు అవసరమైతే తాను ఇండిపెండెంట్ గా పోటీ చేస్తానంటూ వ్యాఖ్యానించారు న్యూయార్క్ ప్రస్తుత మేయర్ ఎరిక్ ఆడమ్స్. ఇంతకూ ఆయన ఇంతటి వ్యాఖ్యలు చేయటానికి కారణం.. మమ్దానీ ఎన్నికల హామీలేనని చెప్పాలి. ఆయన ఇస్తున్న హామీల్లో ప్రధానమైనవి చూస్తే..

అపార్ట్ మెంట్లలో అద్దెల క్రమబద్ధీకరణ. అవసరమైతే భారీగా తగ్గేలా ఏర్పాట్లు

ప్రజాధనంతో ప్రజలందరికి ఉచిత బస్సు సౌకర్యం

శిశు సంరక్షణ కార్యక్రమాలు

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సూపర్ మార్కెట్లు తెరవటం

ఎన్నికల హామీల అమలుకు 10 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతాయి. వాటిని సమకూర్చుకునేందుకుసంపన్నులపై అధిక పన్నులు.

ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ యుద్ధ నేరాలకు పాల్పడ్డారు. అతను న్యూయార్క్ కు వస్తే అరెస్టు చేసి జైల్లో పడేస్తా (ఈ వ్యాఖ్యలు గతంలో చేశారు)

# కోదండరాం, ప్రియాంక గాంధీలకు కూడా ఉద్యోగాలు వచ్చాయి: హరీశ్ రావు



**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదని, కానీ కోదండరాం, ఆకునూరి మురళి, ప్రియాంక గాంధీలకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను తీవ్రంగా మోసం చేస్తోందని, హామీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్‌కు బదులుగా 'దగా క్యాలెండర్'ను అమలు చేస్తోందని ఆయన ఆరోపించారు.నిరుద్యోగ యువత తలపెట్టిన 'ఛలో సచివాలయం' కార్యక్రమానికి తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన ప్రకటించారు. ఇచ్చిన హామీలను సాధించుకునేందుకు నిరుద్యోగులకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

"ఎన్నికల ముందు ఎన్నో ఆశలు కల్పించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు వస్తాయని యువత ఎంతో నమ్మింది. కానీ అధికారంలోకి వచ్చాక ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా యువతను మోసం చేశారు. నోటిఫికేషన్లు వద్దంటూ యువతే ధర్నాలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుష్ప్రచారం చేయడం దారుణం" అని ఆయన మండిపడ్డారు. తమ బీఆర్ఎస్ పాలనలో 1.62 లక్షల ఉద్యోగాలు కల్పించామని ఈ సందర్భంగా హరీశ్ గుర్తు చేశారు.ప్రియాంక గాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండదా? అని హరీశ్ రావు ప్రశ్నించారు. "ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసేంత వరకు వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. నిరంతరం వెంటపడి ఆ హామీని నెరవేర్చేలా ఒత్తిడి తెస్తాం" అని ఆయన తేల్చిచెప్పారు. ఈ అంశంపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో ప్రభుత్వ జాప్యాన్ని కూడా హరీశ్ రావు తప్పుబట్టారు. "ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తే ఎలాంటి కమిషన్లు రావనే ఉద్దేశంతోనే వాటిని నిలిపివేశారా?" అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, వారి హక్కుల సాధనలో ముందుంటుందని భరోసా ఇచ్చారు.

# ఉద్దేశపూర్వకంగా నాపై నీచమైన దుష్ప్రచారం చేస్తున్నారు: కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:**టెలిఫోన్ ట్యాపింగ్ వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించారు. తనపై కావాలనే కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని, వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి నీచమైన ప్రయత్నాలపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

"కొంతమంది వ్యక్తులు మీడియా ముసుగులో ఉద్దేశపూర్వకంగా నాపై దుష్ప్రచారానికి పాల్పడుతున్నారు. కొన్ని మీడియా సంస్థలు, కొంతమంది వ్యక్తులతో కలిసి ముఠాగా మారి బీఆర్ఎస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారం సాగిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా విలేకరుల వేషం వేసుకుని మా పార్టీ నాయకత్వంపై విషం చిమ్ముతున్నారు," అని కేటీఆర్ ఆరోపించారు.

తనపై చేస్తున్న అసత్య ఆరోపణలు, నిందనలతో తన కుటుంబసభ్యులు, స్నేహితులు, పార్టీ శ్రేణులు తీవ్రంగా బాధపడుతున్నారని ఆయన వెల్లడించారు.

"నాపైన వ్యక్తిగతంగా వీరి మాటలు ప్రభావం చూపించకపోయినా, కుటుంబ సభ్యులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. ఇది సహించదగ్గ విషయం కాదు" అని కేటీఆర్ అన్నారు.

ఇలాంటి దుష్ప్రచారాల వెనుక ఉన్న వారిని గుర్తించి ఒక్కొక్కరిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు.

"మీడియా పేరుతో చీకటి రాజకీయం చేయొద్దు. వ్యక్తిత్వ హననం రాజకీయాలుగా మారిన పరిస్థితిలో ప్రజలు నిజాన్ని తెలుసుకుంటారు. ఈ కుట్రలపై మేం వెనక్కి తగ్గం. చట్టపరంగా సమాధానం చెబుతాం," అని కేటీఆర్ స్పష్టం చేశారు.ఫోన్ ట్యాపింగ్ అంశంలో బీఆర్ఎస్‌పై తప్పుడు వార్తలు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్ర జరుగుతోందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వాన్ని మచ్చిక చేసేందుకు ఇదంతా ప్రణాళికాబద్ధంగా జరుగుతోందని ఆరోపించారు.

ఈ సందర్భంగా ప్రజలకు, తన అనుచరులకు కేటీఆర్ ఒక సంకేతం పంపారు. "ఒక్కొక్కరిని గమనిస్తున్నాం. ఎవరు ఏం చేస్తున్నారు, ఎవరు చట్టాన్ని మించిన ప్రయత్నాలు చేస్తున్నారు అన్నదాన్ని రికార్డ్ చేసుకుంటున్నాం. సరైన సమయంలో చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి మీడియా వ్యవహార తీరుపై పెద్ద చర్చకు దారితీసే అవకాశం ఉంది. తాను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ అవుతున్నానని చెబుతున్న కేటీఆర్ మాటలు రాజకీయంగా దుమారం రేపనున్నాయన్నది స్పష్టం.

## క్యాన్సర్‌ను గుర్తించేందుకు కొత్త టెస్టు..

# ముందే జాగ్రత్తపడొచ్చు !




**హైదరాబాద్ పెన్ పవర్:**క్యాన్సర్.. ఇప్పుడు ప్రపంచాన్ని భయపెడుతున్న మహమ్మారి ఇది. అప్పుడే పుట్టిన పసి పిల్లల నుంచి పండు ముసలి వరకు ఈ వ్యాధి బారిన పడనివారు లేరంటే అతిశయోక్తి కాదు. కణాల్లో మెల్లగా మొదలై.. వేగంగా విస్తరిస్తూ.. తక్కువ సమయంలోనే డ్యామేజ్ చేసి మనుషులను హరిస్తోంది. వ్యాధి బాగా ముదిరాక బయటపడటం.. చాలా మందికి ఏ థెరపీ పనిచేయక ప్రాణాలు వదలటం చూస్తూనే ఉన్నాం. అయితే శాస్త్రవేత్తలు క్యాన్సర్ గురంచి గుడ్ న్యూస్ చెప్పారు. ఇజ్రాయెల్, యూఎస్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా చేసిన ప్రయోగంలో.. ఒక పర్సన్ లుకేమియాకు గురయ్యే ఛాన్సెస్ ఎంత వరకు చెప్పే టెస్టును కనుగొన్నారు. నేచర్ మెడిసిన్ అనే జర్నల్ లో పబ్లిష్ అయిన ఆర్టికల్ లో .. ప్రస్తుతం ఉన్న టెస్టుల స్థానంలో ఈజీగా బ్లడ్ క్యాన్సర్ గుర్తించే టెస్టును డెవలప్ చేసినట్లు ప్రచురించారు. బోన్ మ్యారో (ఎముకలో ఉండే మజ్జ, మూలుగు ) ద్వారా క్యాన్సర్ పరీక్షలు చేసేవారు ఇప్పటి వరకు. సైంటిస్టులు డెవలప్ చేసిన టెస్టుతో ఈజీగా ఫైండ్ అవుట్ చేయవచ్చునని చెబుతున్నారు. ఇజ్రాయెల్ లోని వీజ్మన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ పరిశోధకులు.. మయెలోడిస్ప్లాస్టిక్ సిండ్రోమ్ అనే దానిపై పరిశోధన జరిపారు. ఈ MDS వలన ఎనీమియా వచ్చే అవకాశం ఉందని.. మయెలోడి లుకేమియా అనే క్యాన్సర్ కు దారితీస్తుందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం MDS ను గుర్తించేందుకు బోన్ మ్యారో ను పరీక్షించాల్సి వస్తోంది. అందుకోసం ఎనస్తీషియా (మత్తుమందు) ఇచ్చి ఎముకలోని మజ్జను బయటకుతీయాల్సి వస్తుంది. ఇది కొన్నిసార్లు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంటుంది. అయితే ప్రస్తుత పరిశోధనలో సైంటిస్టులు చాలా అరుదైన స్టెమ్ సెల్స్ ను గుర్తించారు. ఇవి బోన్ మ్యారో నుంచి రక్తంలోకి వస్తుంటాయి. ముందస్తుగా MDS వస్తుందా లేదా అనే కీలక సమాచారాన్ని బ్లడ్ లోకి మోసుకొస్తాయి. సింగిల్ సెల్ జెనెటిక్ సీక్వెన్సింగ్ ద్వారా.. బ్లడ్ సాంపుల్ నుంచి క్యాన్సర్ ప్రమాదం ఎంత మేరకు ఉందో.. ముందుగానే గుర్తించవచ్చు.

బ్లడ్ లో సర్క్యులేట్ అయ్యే ఈ స్టెమ్ సెల్స్.. వ్యక్తి వయసును బట్టి.. ఏ ఏ స్థాయిలో ఎంత వరకు సమస్య ఉందనే సమాచారాన్ని అందిస్తాయని, దీంతో క్లిష్టమైన బోన్ మ్యారో టెస్ట్ అవసరం లేకుండానే బ్లడ్ సాంపుల తో క్యాన్సర్ ను గుర్తించవచ్చునని సైంటిస్టులు చెబుతున్నారు. అయితే ఈ సెల్స్ స్త్రీలలో కంటే పురుషులలో తొందరగా రూపాంతరం చెందుతాయని.. అందుకే పురుషులలో బ్లడ్ క్యాన్సర్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది పేర్కొన్నారు. బ్లడ్ క్యాన్సర్ తో పాటు ఈ టెస్టు ద్వారా వయసు రీత్యా వచ్చే రక్తసంబంధిత సమస్యలను గుర్తించవచ్చునని సైంటిస్టులు తెలిపారు. ఈ ప్రయోగం ఫలితాలు పెద్ద ఎత్తున సాంపుల్ సేకరించి.. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో క్లినికల్ ట్రయల్స్ చేసిన తర్వాత ప్రకటిస్తున్నట్లు చెప్పారు. సైంటిస్టులు కనుగొన్న ఈ టెస్టుతో మున్ముందు బ్లడ్ క్యాన్సర్ పరీక్షించడం, కనుక్కోవడం చాలా తేలిక అవుతుందని చెబుతున్నారు.


# టార్గెట్ కేసీఆర్.. రేవంత్ సక్సెస్ రేటెంత?!

హైదరాబాద్ పెన్ పవర్:రాజకీయాల్లో ప్రత్యర్థులను టార్గెట్ చేయడం అనేది అవసరం. అసలు ప్రత్యర్థుల ఊసు లేకుండా రాజకీయాలే లేవు కదా! తెలంగాణలోనూ అదే జరుగుతోంది. తన ప్రత్యర్థిని టార్గెట్ చేయకపోతే.. తనకు ఇబ్బం ది అని భావించిన సీఎం రేవంత్ రెడ్డి .. మాజీ సీఎం కేసీఆర్ కేంద్రంగా అడుగులు వేస్తున్నారు. త్వరలోనే గ్రామ స్థాయి ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన దరిమిలా.. కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ ఎన్నికలను తనవైపు అనుకూలంగా తిప్పుకోవాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచన.



ఈ క్రమంలో కేసులు, శిక్షలు.. అని కూర్చుంటే ప్రమాదమని అనుకున్నారో.. ఏమో తెలియదు కానీ.. ఇప్పు డు భారీ ప్రణాళికతోనే ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. తనే స్వయంగా బరిలోకి దిగుతున్న ట్టు సంకేతాలు ఇచ్చారు. దీనిలో ప్రధానంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతోపాటు.. బీఆర్ ఎస్ హయాంలో జరిగిన అక్రమాలు, అన్యాయాలను కూడా.. వెలికి తీస్తామని చెబుతున్నారు. నిజానికి తీయా ల్సినవి ఇప్పటికే తీశారు. అయినా.. మిగిలి ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. వీటితోపాటు.. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు.. వంటివాటినిఆయన తెరమీదికి తెచ్చారు. గ్రామ స్థాయిలో రాజకీయాలను ప్రభావితం చేసేలా ఇవి మారనున్నాయన్న సంకేతాల నేపథ్యంలో సీఎం.. ఈ దిశగా అడుగులు వేస్తున్నారు. వాస్తవానికి పంచాయతీలకు ఎన్నికలు జరిగినా.. అక్కడ రాజకీయంగా నాయకు లు పోటీచేయరు. ఫలానా పార్టీ తరపున అని నేరుగా ప్రచారం ఉండదు. కానీ, అనుకూల నాయకులు ఉంటారు. ఈ అనుకూల పరిస్థితిని కాంగ్రెస్‌కు అనుకూలంగా మార్చాలన్నదే రేవంత్ వ్యూహం.ప్రస్తుతం బీఆర్ఎస్‌లో అనైక్యత నెలకొన్న దరిమిలా.. కీలక నాయకులు ఎవరికి వారే అన్నట్టుగా ఉన్నా రు. వాస్తవానికి ఇప్పటికే ప్రచారం చేపట్టాలని కేసీఆర్ అనుకున్నా..కుమార్తె విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం చడీ చప్పుడు లేకపోయినా.. పార్టీ నెంబర్ 2గా ఎదగాలని కవిత భావిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఆమె ఉత్తరాల ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఇక, కేటీఆర్ దాదాపు సైలెంట్ అయ్యారు. సరిగ్గా ఇదేసమయం తమకు అనుకూలంగా మారుతుందని అనుకుంటున్న రేవంత్.. కేసీఆర్‌కు వ్యతిరేకంగా గ్రామ స్థాయికి తన సర్కారు మేళ్లను తీసుకువెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరి ఆయన ఏమేరకు సక్సెస్ అవుతారన్నది చూడాలి.

## మహాటీవీ ఆఫీసుపై దాడి.. తీవ్రంగా స్పందించిన రేవంత్ రెడ్డి




హైదరాబాద్ పెన్ పవర్:ప్రముఖ తెలుగు వార్తా ఛానల్ మహాటీవీ కార్యాలయంపై జరిగిన దాడిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ఆయన సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు. మీడియా సంస్థపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని, దీనిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి దాడులకు ఏమాత్రం తావులేదని రేవంత్ రెడ్డి తన ప్రకటనలో పేర్కొన్నారు.మహా న్యూస్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు ఎటువంటి స్థానం లేదని, మీడియా సంస్థలపై దాడులు చేయడం అంటే ప్రజల అభిప్రాయ స్వేచ్ఛను అణచివేయాలనే దురుద్దేశంతో కూడిన చర్య అని ఆయన అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఈ ఘటనను నిర్దాక్షిణ్యంగా చూడాలని,

ఈ దాడిలో పాలుపంచుకున్నవారితో పాటు, ఈ ?దాడి వెనుక నిలిచినవారినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను సూచిస్తున్నానని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను సహించేది లేదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడడమే మనందరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు.

## పెళ్లికి ముందే పార్ట్నర్‌తో డీల్!

హైదరాబాద్ పెన్ పవర్:ప్రపంచ కుబేరులలో ఒకరైన అమెజాన్ అధిపతి జఫ్ బెజోస్ తన ప్రియురాలు లారెన్ శాంచెజ్‌తో ఇటలీలోని వెనిస్‌లో అంగరంగ వైభవంగా వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లి వేడుకకు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖులు హాజరయ్యారు. అయితే ఈ వివాహ వేడుకల కంటే, ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన విషయం చర్చనీయాంశంగా మారింది. అదేంటంటే పెళ్లికి ముందే భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చేసుకున్న ఒక "డీల్" ఆసక్తిరేపుతోంది.



**విడాకులపై ముందస్తు ఒప్పందం?**

గతంలో జెఫ్ బెజోస్ తన మొదటి భార్య మ్యాకెంజీ స్కాట్‌తో విడాకులు తీసుకున్నప్పుడు, ఆమెకు ఇచ్చిన సెటిల్‌మెంట్ మొత్తం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. దాదాపు 38 బిలియన్ డాలర్ల భారీ మొత్తాన్ని మ్యాకెంజీకి చెల్లించడంతో ఆమె ప్రపంచంలోనే అత్యంత ధనవంతురాలిగా నిలిచారు.

ఈ అనుభవాల నేపథ్యంలో బెజోస్ ఈసారి మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. లారెన్ శాంచెజ్‌తో పెళ్లికి ముందే విడాకుల సందర్భంలో ఆస్తి పంపకంపై ఒక "ప్రెనప్ డీల్" (వివాహ పూర్వ ఒప్పందం) చేసుకున్నారని వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ ఒప్పందంలో విడాకులు వస్తే ఎలాంటి ఆస్తులు ఎవరి పేరుమీద ఉండాలి, ఎవరికి ఎంత భరణం ఇవ్వాలి వంటి వివరాలను స్పష్టంగా పొందుపరిచినట్లు సమాచారం.

**ఈ డీల్ ఎందుకు ముఖ్యం?**

ప్రపంచస్థాయి వ్యాపారవేత్తలే కాకుండా, సినీ తారలు కూడా ఇప్పుడు పెళ్లికి ముందే ఇలాంటి ఒప్పందాలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా కొంతమంది విడాకుల తర్వాత భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ముందే ఈ రకమైన లీగల్ ఒప్పందాలతో జాగ్రత్త పడుతున్నారు.బెజోస్ విషయంలో ఇది రెండో వివాహం కావడంతో, గత అనుభవాన్ని బట్టి ఈసారి అన్ని విషయాల్లో ముందే స్పష్టత తెచ్చుకున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జఫ్ బెజోస్, లారెన్ శాంచెజ్ వివాహం వెనుక ప్రేమ కథ ఎంత బలంగా ఉన్నప్పటికీ, భవిష్యత్తును ముందుగానే ఊహించి తీసుకున్న ఈ జాగ్రత్తలు ఇప్పుడు చర్చకు దారితీస్తున్నాయి. ఇది ప్రస్తుతం ప్రముఖుల వివాహాల్లో ఒక సాధారణ ప్రక్రియగా మారిందని నిపుణులు అంటున్నారు. ఇటలీలో ఘనంగా జరిగిన ఈ వివాహానికి ఇలా ఒక లీగల్ డీల్ కూడా జత కావడంతో, ఈ పెళ్లి నిజంగానే వార్తల్లో నిలుస్తోంది!